GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 345 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం : ఆగస్టు-07-2024 | పేజీలు : 3



## నాగార్జున సాగర్ లో లేవల్ కాలువకు గండి

**టీ మీడియా, ఆగస్టు 6, నల్గొండ :**

శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ కు భారీగా వరద వస్తుండటంతో అధికారులు సాగర్ గేట్లతో పాటు కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం వరద ఉధృతి భారీగా పెరగడంతో అనుములు మండలం మారెపల్లి వద్ద భారీ గండి పడటంతో కాలువలోని నీరు పొలాల్లోకి భారీ ఎత్తున చేరుకున్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారుల వెంటనే ఎడమ కాలువను మూసి వేసినట్లు తెలిపారు. అలాగే గండి పడిన ప్రదేశానికి చేరుకుని పూడిక పనులు ప్రారంభించినట్లు తెలుస్తుంది. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణకు భారీ పెట్టుబడులు

- రూ.839 కోట్ల పెట్టుబడికి కర్రా హెూల్డింగ్ ఓకే
- వీ హబ్ లో భారీ పెట్టుబడులు
- మహిళ పారిశ్రామిక వేత్తలకు నిధుల వరద
- స్టార్టప్ లలో మరో రూ.839 కోట్లు
- రేవంత్ అమెరికా పర్యటనలో మరో పెద్ద కంపెనీతో ఒప్పందం

**టీ మీడియా, ఆగస్టు 6, న్యూయార్క్:**

అమెరికాకు చెందిన వాల్ష్ కర్రా హెూల్డింగ్స్ తెలంగాణలో పెట్టుబడులకు సిద్ధపడింది. రాబోయే అయిదేండ్లలో వీ హబ్లో రూ.42 కోట్ల (5 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. రాబోయే ఐదేళ్లలో వీ హబ్ తో పాటు తెలంగాణలో నెలకొల్పే స్టార్టప్లలో దాదాపు రూ.839 కోట్ల (వంద మిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. వాల్ష్ కర్రా కంపెనీకి చెందిన ఫణి కర్రా, గ్రెగ్ వాల్ష్, వీ హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దేశంలోనే వినూత్నంగా తెలంగాణ ప్రభుత్వం మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వీ హబ్ ను ఏర్పాటు చేసింది.తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు సమక్షంలో ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా వాల్ష్ కర్రా ప్రతినిధులను అభినందించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలే తెలంగాణ సామర్థ్యాన్ని చాటిచెపుతున్నారని, పారిశ్రామిక రంగంలో మహిళల అభివృద్ధి సమాజంలోని అసమానతలను తొలిగిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. మహిళలకు సాధికారత లేకుంటే ఏ సమాజమైనా తన సామర్థ్యాన్ని సాధించలేదని అభిప్రాయ పడ్డారు.వాల్ష్ కర్రా హెూల్డింగ్స్ కంపెనీ అమెరికా, సింగపూర్ నుంచి పని చేస్తుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహకారంతో పెట్టుబడిదారులు గ్రెగ్ వాల్ష్, ఫణి కర్రా దీన్ని నిర్వహిస్తున్నారు. రాబోయే శతాబ్దానికి సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించేందుకు అవసరమైన పెట్టుబడి అవకాశాలను వృద్ధి చేయాలనేది కంపెనీ సంకల్పం. కొత్త ఆవిష్కరణలు, స్థిరత్వంతో పాటు లాభదాయకమైన సంస్థలకు ఈ కంపెనీ మద్దతు ఇస్తుంది. వీటిలో పెట్టుబడులు పెట్టి కార్యకలాపాల విస్తరణతో పాటు స్థిరమైన భవిష్యత్తు నిర్మించేందుకు సహకరిస్తుంది.







వీ హబ్ తో ఒప్పందం సందర్భంగా గ్రెగ్ వాల్ష్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో మరో అడుగు ముందుకు పడిందని అన్నారు. పెట్టుబడులతో పాటు పట్టణాలతో పాటు గ్రామీణ తెలంగాణలోనూ ప్రభుత్వంతో కలిసి వివిధ కార్యకలాపాలు చేపట్టి నమ్మకమైన భాగస్వామ్యం పంచుకుంటామని ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కెరీర్ ప్రారంభించి అంతర్జాతీయ స్థాయికి చేరగలిగానని, మన దేశం, రాష్ట్రం పట్ల కృతజ్ఞతను చాటుకునే అవకాశం దొరికిందని ఫణి అన్నారు. తమ పెట్టుబడులు, తమ సంస్థ భాగస్వామ్యం తప్పకుండా సానుకూల ప్రభావం చూపుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ ప్రమాణా లతో కూడిన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌లు రూపొందించడానికి ఈ పెట్టుబ డులు ఉపయోగపడుతాయని వీ హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల తెలిపారు.

### గద్దర్ కు నివాళి...

కవి, గాయకుడు, సామాజిక ఉద్యమకారుడు, ప్రజా యుద్ధనౌక స్వర్గీయ గద్దర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళులర్పించారు. ఈ మేరకు అమెరికా నుంచి సీఎం రేవంత్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాజరికం కత్తి మీద నెత్తురుల గాయమా.. దొరవారి గడులల్లో నలిగిపోయిన న్యాయమా..' అంటూ పాటలతోనే పోరు బాటలు వేసిన నిఖార్సైన తెలంగాణ వాది, పొడుస్తున్న పొద్దులో వినిపించే ప్రజా విముక్తి గీతం గద్దరన్న అని ఒక సందేశంలో ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గద్దర్ పేరిట సాంస్కృతిక-సినీ అవార్డులను నెలకొల్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### జయశంకర్ సార్ కి అంజలి..

తెలంగాణ సాధనే ధ్యేయంగా జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంవత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళి అర్పించారు. 'ఒకరిని యాచించడం కాదు.. ఇక్కడి ప్రజలే శాసించే తెలంగాణ కావాలి' అన్న జయశంకర్ గారి మాటల స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, పెద్ద సారు కోరుకున్న విధంగా తెలంగాణలో ప్రజాస్వామిక సంస్కృతిని ప్రజా ప్రభుత్వం తిరిగి నిలబెట్టిందని పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం కొలువైన తర్వాత మొదటి కేబినెట్ సమావేశంలో తొట్టతొలి నిర్ణయంగా జయశంకర్ సార్ స్వస్థలం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా గుర్తించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు రేవంత్ .




## భారత్‌లోనే బంగ్లాదేశ్ ప్రధాని

- యూకే అనుమతులు వచ్చేవరకూ

**టీ మీడియా, ఆగస్టు 6 , ఢిల్లీ:**


బంగ్లాదేశ్‌లో హింసాత్మక పరిణామాల నేపథ్యంలో ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా, ఆ దేశాన్ని కొన్ని నిమిషాల వ్యవధిలోనే విడిచి ఇండియాకు వచ్చారు. తాను ఇండియాకు వస్తున్నట్లు ఆమె అభ్యర్థించారని రాజ్యసభలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చెప్పారు. తమకు కొన్ని నిమిషాల ముందే ఆమె ఈ విషయాన్ని చెప్పినట్లు తెలిపారు. ఢాకా నుంచి బంగ్లా ఆర్మీకి చెందిన సి -130జె ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఎజెఎఎక్స్ పేరుతో ఢాకా నుంచి టేకాఫ్ అయి, కోల్‌కతా మీదుగా ఢిల్లీకి సమీపంలోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కి చెందిన హిండన్ ఎయిర్ బేస్‌కి చేరుకున్నారు. ప్రస్తుతం ఆమె భారత ఇంటలిజెన్స్ ఏజెన్సీల సురక్షిత కస్టడీలో ఉన్నారు.బంగ్లా ఆర్మీ హెలికాప్టర్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో భారత సరిహద్దు వద్ద అతి తక్కువ ఎత్తులో ఎగురుతున్నట్లు మన రాడార్లు గుర్తించాయి. భారత గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే విమానంలో ఎవరున్నారనే విషయాన్ని తెలుసుకుని భారత్ రాడార్ వ్యవస్థ విమానంపై నిఘా పెంచింది. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రెండు రాఫెల్ యుద్ధవిమానాలను రక్షణగా పంపాయి. " బంగ్లాదేశ్‌తో ఉన్న భారత సరిహద్దు నుండి 10 కిలోమీటర్ల దూరంలో ఎజెఎఎక్స్ 1431 అనే కాల్ గుర్తుతో కూడిన సి-130 ఎయిర్‌క్రాఫ్ట్‌ను భారతదేశం పర్యవేక్షించడం ప్రారంభించింది. అది ఢిల్లీ వైపు వెళుతోంది. బంగ్లాదేశ్ వైమానిక దళం విమానం సాయంత్రం 4 గంటలకు పాట్నాను దాటి యుపి-బీహార్ సరిహద్దుకు చేరుకుంది." అని అధికారులు తెలిపారు.షేక్ హసీనా రాజకీయ శరణార్థిగా యూకేలో ఆశ్రయం కోరినట్లు సమాచారం. దీనిపై బ్రిటన్ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో యూకే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఆమె భారత్‌లో ఉండేందుకు న్యూఢిల్లీ తాత్కాలిక అనుమతులు ఇచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ సమయంలో హసీనాకు భారత్ సంస్థాగతంగా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలుస్తోంది.మరోవైపు బంగ్లాదేశ్ తాజా రాజకీయ పరిణామాలపై బ్రిటన్ ప్రభుత్వం స్పందించింది. గత రెండు వారాలుగా అల్లర్ల కారణంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, ప్రాణ నష్టంపై ఐక్యరాజ్యసమితి నేతఅత్వంలో దర్యాప్తు జరిపించాలని అభిప్రాయపడింది.ఈ మేరకు యూకే విదేశాంగ కార్యదర్శి అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే, ఇందులో షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చే అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం.హసీనా సోదరి రెహానా యూకే పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్ధిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరపున పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం యూకేలో లేబర్ పార్టీనే అధికారంలో ఉంది. ఈ క్రమంలోనే హసీనా బ్రిటన్ ప్రభుత్వాన్ని ఆశ్రయం కోరినట్లు తెలుస్తోంది.మరోవైపు, బంగ్లాదేశ్‌లో నెలకొన్న కల్లోల పరిస్థితులను భారత ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. దీనిపై చర్చించేందుకు అఖిలపక్షం సమావేశమైంది. బంగ్లా సరిహద్దు రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మేఘాలయలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నిరవధిక కర్ఫ్యూ విధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అటు.. బంగ్లాలో ఉద్రిక్త పరిస్థితుల దఅష్ట్యా రెచ్చగొట్టే వీడియోలు షేర్ చేయొద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వాటిని వ్యాప్తి చేస్తే రాష్ట్రంలో అసమ్మతి, అశాంతి రగిలే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# రుణమాఫీ మంటలు...

## కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్, బీజేపీ ఫైర్..

**టీ మీడియా,ఆగస్టు 6,హైదరాబాద్:**

రుణమాఫీ విషయంలో ఇప్పుడు అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. రుణమాఫీ విషయంలో తెలంగాణ సర్కారు రైతులను మోసం చేసిందని ఆరోపించారు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి. దాదాపు 40 లక్షల మంది రైతులు లక్ష రూపాయల వరకు రుణం తీసుకుంటే 17 లక్షల మందికే మాఫీ చేశారన్నారు. రుణం మాఫీ కాని రైతులు వివరాలు పంపించాలన్నారు నిరంజన్ రెడ్డి. ఇందుకోసం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా ఓ నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. రుణమాఫీ అయ్యేవరకు, రైతు హామీలు నెరవేర్చేవరకు తమ పోరాటం ఆగదని బీఆర్ఎస్ నేతలు స్పష్టంచేస్తుననారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 15 వరకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామంటోంది ప్రభుత్వం. ప్రతిపక్షాల తీరుపై అధికార పార్టీ నేతలు మండిపడుతున్నారు. రైతాంగం ద్వారా రాజకీయం చేయాలని విపక్షాలు చూస్తున్నాయని ఆరోపిస్తున్నారు. అభూత కల్పనలతో రైతుల మనోభావాలను దెబ్బతీయవద్దని సూచిస్తున్నారు.



### మంత్రి తుమ్మల ఏమన్నారంటే..

ఇప్పటి వరకు 30 వేల రైతుల ఖాతాలకు సంబంధించి సాంకేతికంగా ఇబ్బంది వచ్చిందని అంటున్నారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. లక్ష లోపు రుణాలకు సంబంధించి 17 వేల ఖాతాల్లో రుణమాఫీ జరగలేదన్నారు. దీనికి సంబంధించి 85 కోట్ల రూపాయలు తిరిగి వచ్చాయని మంత్రి తుమ్మల చెప్పారు. లక్షన్నర రుణమాఫీలో సాంకేతిక సమస్యలకు సంబంధించి ఇంకా డీటేయిల్స్ అందలేదన్నారు.

ఇప్పటికే లక్షన్నరలోపు రుణాలు మాఫీ చేశామని.. త్వరలోనే రూ.2లక్షల వరకు రుణాలన్నీ మాఫీ చేస్తామని తుమ్మల చెప్పారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేసే బాధ్యత తమదని.. సాంకేతిక కారణాలతో ఎవరికైనా మాఫీకాకపోయినా..వాటిని పరిష్కరించి రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు.. అప్పుడే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయంటూ విమర్శించారు. తమపై బురదజల్లితే ఆ బురద వాళ్ల మీదే పడుతుందని తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు.

### బీజేపీ రచ్చబండ..

ఇదంతా ఇలా ఉంటే రేపటి నుంచి గ్రామాల్లో రైతు రచ్చబండ నిర్వహించేందుకు సిద్ధం అవుతుంది బీజేపీ. రుణమాఫీపై తాము ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు విశేష స్పందన లభిస్తోందని ఆపార్టీ నేతలు అంటున్నారు. ఇప్పటి వరకు 27 వేల మంది రైతులు తమ సమస్యను ఫిర్యాదు రూపంలో చెప్పారంటున్నారు. రైతుల నుంచి సేకరించిన ఫిర్యాదులతో గవర్నర్ కలుస్తామంటున్నారు బీజేపీ నేతలు.

### నిరంజన్ రెడ్డి ఫైర్..

రుణమాఫీ మాఫీ చేసినట్లు మాట్లాడుతున్నారే తప్ప ఎంత మందికి ఇచ్చారనేది లెక్క ఎందుకు చెప్పడం లేదని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. రుణమాఫీ కాని రైతులు వివరాలు తాము చూపించే నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. అయితే దీనికి కౌంటర్ ఇచ్చారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..

## ఉన్నత చదవుల కోసం వెళ్లి కానరానీ లోకాలకు..

### అమెరికాలో తెలంగాణ యువకుడు మృతి

**టి మీడియా, ఆగస్ట్ 6, హైదరాబాద్:**

అమెరికాలో ఎంఎస్ చదువుతున్న సిద్దిపేటకు చెందిన ఓ విద్యార్థి ఓ సరస్సులో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడు ధూలిమిట్టలోని కుటిగల్‌కు చెందిన తూశాలపురం సాయి రోహిత్ (23)గా గుర్తించారు. మంగవ్వ, మహదేవ్ దంపతుల పెద్ద కుమారుడు. అతని స్నేహితులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022లో సీవీఆర్ కాలేజీలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన రోహిత్, సియాటిల్‌లోని మిస్సోరీ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ చదివేందుకు 2023 డిసెంబర్‌లో యూఎస్ వెళ్లాడు .రోహిత్ యూనివర్సిటీ ఆవరణలో భారతదేశానికి చెందిన తన నలుగురు స్నేహితులతో కలిసి హాస్టల్ గదిలో నివాసం ఉంటున్నాడు. జులై 22న ఔటింగ్‌కు వెళ్లిన అతను క్యాబ్‌లో హాస్టల్ గదికి తిరిగి వస్తుండగా గమ్యస్థానానికి వెళ్లే మధ్యలో మరో క్యాబ్ ఎక్కి కనిపించకుండా పోయాడు. ఫోన్ చేసినా రాకపోవడంతో అతని స్నేహితుడు అవినాష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.జులై 24న సరస్సులో అతడి మృతదేహం లభ్యం కావడంతో.. అతడి మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) సహకారంతో మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అతని స్నేహితులు కొందరు నిధులు కూడా సేకరిస్తున్నారు. ఈ ఘటనతో కుటిగల్‌లోని కుటుంబ సభ్యులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.




## ఏబీసీడీ కేటగిరీలేంటీ?

- అక్రెడిటేషన్ విధానంపై హైకోర్టు సీరియస్
- జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల నిరాకరణ చెల్లదు
- రెండు నెలల్లో మార్గదర్శకాలు రూపొందించాలి

**టీ మీడియా, ఆగస్టు 6 ,హైదరాద్ :**

చిన్న పత్రికల్లో పనిచేసే జిల్లా, నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు కార్డు) ఇవ్వకుండా దూరం పెట్టడం చెల్లదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ %-% 2016లోని షెడ్యూల్ 'ఈ' ని కొట్టేస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది. చిన్న వార్తా పత్రికలను నాలుగు విభాగాలుగా విభజించడం సరికాదని హైకోర్టు పేర్కొంది. 2016లో జీవో 239 ద్వారా అప్పటి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సవాల్ చేస్తూ మహబూబ్‌నగర్‌కు చెందిన తాటికొండ కృష్ణ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.




**విచారణ చేపట్టిన ధర్మాసనం..**

ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న హై కోర్టు 'చిన్నపత్రికల్లో పనిచేసే జర్నలిస్టులను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా ఎందుకు విభజించారో సరైన వివరణ లేదు. తగిన వివరణ, సమర్థన లేకుండా మిగతా వారితో సమానంగా గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం చెల్లదు. రెండు నెల్లో పారదర్శక, హేతుబద్ధమైన ప్రాతిపదికన మార్గదర్శకాలు రూపొందించాలి' అని హై కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.



## సార్ అడుగు జాడలలోనే మేం

### ప్రొఫెసర్ జయశంకర్ కు కెసిఆర్ నివాళి

**టీ మీడియా, ఆగస్టు 6, హైదరాబాద్, :**

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన తెలంగాణ కోసం చేసిన కృషి, త్యాగాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. తొలిదశ నుం చి మలి దశ ఉద్యమం దాకా తెలంగాణ సాధన దిశగా ప్రొఫెసర్ జయశంకర్ చేసిన భావజాల వ్యాప్తి, దశాబ్దాలపాటు సాగిన ఉద్యమంలో వా రు అందించిన పోరాటస్ఫూర్తిని కేసీఆర్ కొనియాడారు. వారి అడుగుజాడల్లో తాను మలిదశ ఉద్యమానికి సారథ్యం వహించి, చివరి దాకా శాంతియుత పద్ధతిలో, పార్లమెంటరీ పంథాలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగించినట్టు చెప్పారు.చివరకు అరవై ఏండ్ల స్వయంపాలన ఆకాంక్షను నిజం చేసుకున్నామని కేసీఆర్ గుర్తుచేశారు. రాష్ట్ర సాధ న అనంతరం ప్రజల మద్దతుతో మొట్టమొదటి ప్రభుత్వాన్ని ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే కొనసాగించామని కేసీఆర్ తెలిపారు. ఉద్యమాన్ని నడిపి గమ్యాన్ని చేరుకోవడంలోనూ, తదనంతరం పదేండ్ల అనతికాలంలోనే దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించడంలోనూ వారి స్ఫూర్తి ఇమిడివున్నదని కేసీఆర్ పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలను, సకలజనులను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపిన బీఆర్ఎస్ పాలన స్ఫూర్తిని కొనసాగిస్తూ, తెలంగాణను మరింతగా ప్రగతి పథంలో నడిపేలా కృషి చేయడమే వారికందించే ఘననివాళి అని కేసీఆర్ తెలిపారు.

## తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు..

3లో..

## షేక్ హసీనాకు సాయం చేస్తామని హామీ ఇచ్చాం

3లో..

## ఏఓబీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి

3లో..

# నీరు శుద్ధి చేస్తున్న పనితీరును పరిశీలించిన కలెక్టర్

**టీ మీడియా,ఆగస్టు 6,వనపర్తి బ్యూరో :**

నీటి క్లోరినేషన్ స్వచ్ఛమైన మిషన్ భగీరథ తాగు నీరు హ్యాబిటేషన్ చివరి ఇంటి వరకు చేరేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం బుగ్గపల్లి తాండా వద్ద 75యం.ఎల్.డి. సామర్థ్యంతో నిర్మితమైన నీటి శుద్ధి కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పరిశీలించారు. నీరు శుద్ధి చేస్తున్న పనితీరును పరిశీలించిన కలెక్టర్ నీటి క్లోరినేషన్ శాతం, పి.హెచ్ విలువలు పరిశీలించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు అవసరమైన తాగు నీరు ఎంత, మిషన్ భగీరథ ద్వారా ఒక రోజుకు శుద్ధి చేస్తున్న శుద్ధ జలం ఎంత, మార్గమధ్యలో వృధా అవుతున్న నీరు ఎంత అనే వివరాలను మిషన్ భగీరథ ఎస్. ఈ ను అడిగి తెలుసుకున్నారు. ఒవర్ హెడ్ ట్యాంక్ నుండి ఊరి చివరి ఇంటి వరకు శుద్ధమైన జలం వెళ్ళాలని అక్కడ మీటర్ ద్వారా నీటి నాణ్యత పరిశీలించి వచ్చిన విలువలను రిజిస్టర్ లో నమోదు చేసే విధంగా పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పైప్ లైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని, ఎక్కడైనా లీకేజీ ఫిర్యాదు వస్తే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రోజుకు ఎంత నీరు వదలాలి అనేది నియంత్రించాలని సూచించారు. ట్రీట్మెంట్ ప్లాంట్ కు విచ్చేసిన పాఠశాల విద్యార్థులకు నీరు ఎలా శుద్ధి అవుతుందో ఇంజనీర్లు ప్రయోగాత్మకంగా చూపించారు. పచ్చదనంలో భాగంగా అనంతరం అక్కడే ఆవరణలో మొక్కలు నాటారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మిషన్ భగీరథ ఎస్. ఈ వెంకటరమణ, ఈ. ఈ మేఘా రెడ్డి, డి. ఈ లు. ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.



## లడ్డూ కౌంటర్లను పరిశీలించిన ఆదనపు ఈవో

- **తిరుమలలో లడ్డూ కౌంటర్లను పరిశీలించిన ఆదనపు ఈవో**

**టీ మీడియా, ఆగస్టు 6 ,తిరుమల :**

తిరుమలలోని లడ్డూ కౌంటర్లను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి టిటిడి అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి పరిశీలించారు. పోటు పేష్కార్ శ్రీనివాసులుతో పాటు అడిషనల్ ఈవో లడ్డూ కాంప్లెక్స్ ను సందర్శించి దర్శనం టిక్కెట్లపై కౌంటర్లలో లడ్డూలు జారీ చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం లడ్డూ ప్రసాదాల తయారీకి సంబంధించిన ముడిసరుకుల నిల్వ ఉన్న ఉగ్రాణం కూడా పరిశీలించారు. లడ్డూ కవర్ల విక్రయంపై, లడ్డూ ప్రసాదం పంపిణీపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రసాదాల పంపిణీలో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజివో నంద కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా అవగాహన ర్యాలీ

**టీ మీడియా,న్యూస్ ఆగస్టు 6, పెద్ద దోర్నాల**

పెద్ద దోర్నాల మండలంలోని కడప రాజు పల్లి అంగన్వాడి స్కూల్లో తల్లిపాలు వారోత్సవాలు ఈ నెల ఒకటో తేదీ నుండి ఏడో తేదీ వరకు ఈ కార్యక్రమాల్లో నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం నాడు కడప రాజు పల్లి సెక్టార్ పరిధిలో గల అంగన్వాడీ సెంటర్ లో తల్లిపాలు వారోత్సవాలు ర్యాలీలో "తల్లిపాలు ముద్దు– డబ్బా పాలు వద్దు వంటి నినాదంతో ర్యాలీలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ . ఎం అంజమ్మ.మాట్లాడుతూ తల్లిపాల వలన బిడ్డలకు కలిగిన ప్రయోజనాలను తల్లులకు అవగాహన కల్పించారు. మొదటి గంట లోపు ముర్రుపాల వలన పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని. రోజుకు కనీసం ఏడు సార్లుకు తక్కువ కాకుండా పాలు ఇవ్వవలి తల్లిపాలు ఇచ్చేటప్పుడు తల్లి బిడ్డకు అప్యాయంగా ఇవ్వాలి. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదునపాహారం ఇవ్వవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు. బి .అనుష భాయ్. ఆశ వర్కర్లు . ఏ.ఎన్.ఎం.లు. తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి

**టీ మీడియా, ఆగస్టు 6, వనపర్తి బ్యూరో :**

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం ఆచార్య జయశంకర్ 90వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ లో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, అదనపు కల్కర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బడుగు బలహీన వర్గాల జీవితాలు బాగుపడతాయని అహర్నిశలు శ్రమించిన గొప్ప వ్యక్తి ఆచార్య జయశంకర్ సార్ అని కొనియాడారు.స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, ప్రత్యేక రాష్ట్రం కోసం అహర్నిశలు పోరాడారని వారి సేవలు మరువలేనివని అన్నారు. తొలి దశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి మలిదశ ఉద్యమానికి దిక్సూచిగా ఆయన నిలబడ్డారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**టీ మీడియా, ఆగస్టు 6, గోదావరిఖని ప్రతినిధి:**

తెలంగాణ ఉద్యమ కిరణం, దేశవ్యాప్తంగా తన ప్రసంగాలతో ఎలుగెత్తి చూపించిన ప్రొఫెసర్ జయశంకర్ అని అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిట్ సి.రాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం అహర్నిశలు పాటుపడ్డ మహనీయులని, జీవిత కాలం రాష్ట్ర సాధన కోసమే కృషి చేశారని,తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని దేశవ్యాప్తంగా వేదికలో తన ప్రసంగంతో తెలంగాణ ప్రజల నాడిని చేజిక్కించుకున్నారని, నేటి యువతకు ఆయన ఆదర్శప్రాయుడని, పూర్తి దయకుడన్నారు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పోలీసు అధికారులకు సిబ్బందికి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, పిసిఆర్ ఇన్స్పెక్టర్ రవీందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ దామోదర్, మల్లేశం, సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి, సంధ్య, మనోజ్ కుమార్, సిపిఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**టీ మీడియా, ఆగస్టు 6, వనపర్తి బ్యూరో :**

పట్టణ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రొఫెసర్ జయశంకర్ పార్కు వద్ద వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వాకిటి.శ్రీధర్, పి.రమేష్ గౌడ్, జే.ఏ.సిమాజీ చైర్మన్ వేణు గోపాల్ మాట్లాడుతూ జయశంకర్ విద్యార్థిగా నాటి ముల్కీ ఉద్యమంలో నాయకునిగా 1969 మలిదశ ఉద్యమ నాయకునిగా తదనంతరం తెలంగాణ ఉద్యమ నిప్పురవ్వను మూడు దశాబ్దాల పాటు తెలంగాణ అభిలాషను సజీవంగా ఉంచిన తెలంగాణా కర్మయోగి, నిస్వార్థ,నిరాడంబర, విశ్వమానవ తేజోమూర్తి కె.సి.ఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి దశాబ్దంపైగా సైద్ధాంతికంగా ఊపిరులూ ఊదిన తెలంగాణ జ్ఞానశిఖరం ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.నివాళులు అర్పించిన వారిలో నందిమల్ల.అశోక్ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్,కంచె.రవి,మాణిక్యం, లక్ష్మికాంత రెడ్డి,గులాం ఖాదర్ ఖాన్, ఉంగ్లమ్. తిరుమల్, గంధం.పరంజ్యోతి,స్టార్ రహీమ్, నీలస్వామి, జానం పేట.శ్రీను, సూర్యవంశపు.గిరి, చిట్యాల. రాము, జోహేబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి , రాంచందర్,లోకాజి రావు, వజ్రాల రమేష్, తోట.శ్రీను,రాం లక్ష్మన్ పాల్గొన్నారు.



## ఉదయ్ కిరణ్ చారీ అంతిమ యాత్ర

- **పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**టీ మీడియా, ఆగస్టు 6, వనపర్తి బ్యూరో :**

ఆకస్మికంగా మరణించిన తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకులు ఉదయ్ కిరణ్ చారీ అంతిమ యాత్రలో నిరంజన్ రెడ్డి పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల కుటుంబసభ్యులకు తీరని వేదన కలిగించిన వాళ్ళు అవుతారని ఇటువంటి తొందరపాటు నిర్ణయాలు యువత తీసుకోకుండా ఆత్మస్థైర్యంతో సమస్యలు ఎదురుకోవాలని అన్నారు. బీఅర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్ల.శ్రీనివాసయాదవ్ ప్రత్యేకంగా వచ్చి ఉదయ్ కిరణ్ పాడేమోసి నివాళులు అర్పించారు.నిరంజన్ రెడ్డి వెంట జిల్లా అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్, జె.యేసి మాజీ చైర్మన్ వేణు గోపాల్,సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి ప్రేమ్ నాథ్ రెడ్డి,సూర్యవంశపు. గిరి,హేమంత్ ముదిరాజ్,చిట్యాల. రాము గ్రామ బి.ఆర్.ఎస్ నాయకులు ఉన్నారు.



# కోతుల బెడదతో బెంబేలెత్తుతున్న జనం

**టీ మీడియా, ఆగస్టు 5,పెద్ద దోర్నాల :**

పెద్ద దోర్నాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల ఆందోళన చేస్తూ పంచాయతీ సెక్రెటరీ మోహన్ రావుకు కోతుల నుండి కాపాడాలని వినతి పత్రం ఇచ్చిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి. నాయకులు పూల బాబు. బషీరుద్దీన్. మా భాష. షేక్ . హర్షద్..షేక్ బాషా.. కలిసి వినతిపత్రం.ఇవ్వడం జరిగింది. సెక్రటరీ మోహన్ రావు మాట్లాడుతూ. కోతులు పట్టుకునేందుకు బోన్లు ఫారెస్ట్ అధికారులు అడిగాం. ఫారెస్ట్ అధికారులు బోన్లు ఇస్తే కోతులను పట్టుకోవడానికి వాటిని దూరంగా వదిలివేయడానికి సర్పంచ్ తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. పెద్ద దోర్నాలమండలంలోని అన్ని గ్రామాల్లో కోతులు విపరీతమై గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెదిరిస్తూ గాయపరుస్తూ హడలెత్తిస్తున్నాయి.



**కోతుల బెడదతో బెంబేలెత్తుతున్న జనం :**

పెద్ద దోర్నాల గ్రామంలో అన్ని గ్రామాల్లో కోతులు విపరీతమై గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెదిరిస్తూ గాయపరుస్తూ హడలెత్తిస్తున్నాయి. జనాలు కూలీలు రోజువారీ పనుల్లోకి వెళ్లాలంటే భయం భయంగా వెళుతున్నారు. కోతులు పిల్లలపై, పెద్దల పై, వృద్ధుల పై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. వీటి గాయాలకు గురైన ప్రజలు ఉన్నారు. మూడు రోజులకు ఒకసారి టీకాలు తీసుకోవడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగుతూ ఉన్నారు.

గ్రామాల్లో సాధారణ ప్రజలు కిరాణా సామాన్లు ఉప్పు, పప్పు కొనుక్కోవడానికి వెళ్లాలన్న కూడా భయపడుతూ వెళు తున్నారు. మరి పిల్లలకు టిఫిన్ తీసుకువెళ్లాలని. కవర్ ఎక్కడ లాక్కుంటాయో భయపడిపోతున్నారు. రక్షించేందుకు ప్రయత్నం చేస్తున్న ప్రజలు పైన కోతులు దాడులు చేస్తున్నాయి. చివరికి ఇండ్లల్లో చొరబడి అన్నం కూరలు తింటున్నాయని అడ్డు బోయిన ఇంటి యజమానుల మీద దాడులు చేస్తున్నాయని, కోతుల విధ్వంసం దాడుల నుంచి , ప్రజలను, కాపాడాలని మండల ప్రజలు విజ్ఞప్తి. చేశారు.

## అన్నదాతల అభివృద్దే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఎమ్మెల్యే

**టీ మీడియా, ఆగస్టు 6, వనపర్తి బ్యూరో :**

గుడిపల్లి ప్రధాన కాలువను పరిశీలించి సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి పోలికెపహాడ్ గ్రామం అల్లిపూర్ నుంచి మోటార్ సైకిల్ పై కెనాల్ వెంట గుడిపల్లి ప్రధాన కాలువ గేట్ల వరకు పర్యటించారు.సీజన్ మొదట్లోనే నీటి సమస్య రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గుడిపల్లి రిజర్వాయర్ వద్ద గేటును తెరిపించి దిగువకు అధిక నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యే.అన్నదాతల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మంగళవారం కల్వకుర్తి ఎత్తిపోతల ప్రధాన కాలువపై పర్యటించి సమస్యలను గుర్తించారూ.సాగునీరు అందడం లేదని అన్నదాతల విజ్ఞప్తి మేరకు ఆయన కాలువపై ఉన్న రెగ్యులేటర్లను, పంటకాలను పరిశీలిస్తూ వాటిని బాగు చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గుడిపల్లి వద్ద ఉన్న ప్రధాన గేట్ల వద్దనే నీరు తక్కువగా విడుదలవుతుందని గుర్తించిన ఎమ్మెల్యే అధికారులను అక్కడికి పిలిపించి గేట్లను ఓపెన్ చేయించి దిగువకు అధిక నీటిని విడుదల చేయించారు.దాదాపు 1500 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు అధికారులు పేర్కొన్నారు.ప్రధానంగా ఈ 15 రోజులనే అన్నదాతలు ఎక్కువగా వరి నాట్లు ఉంటాయని 15 రోజుల వరకు నీటిని విడుదల చేస్తూనే ఉండేటట్లు చూసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశించారు.



## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**టీ మీడియా, ఆగస్టు 6, వనపర్తి బ్యూరో :**

వనపర్తి నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాదాపు 500 కోట్ల రూపాయలను కేటాయించినట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని హరిజనవాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి హాజరైన ఆయన ముందుగా తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో పెబ్బేరు, ఖిల్లా ఘనపురం, మామిడిమాడ, పాఠశాలలతో పాటు హరిజనవాడ పాఠశాలను సైతం దత్తతకు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ పాఠశాలలను ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 30 వేల మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యనిభ్యసించిన వనపర్తి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం దాదాపు 500 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి పరచనున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తిగా పటిష్టపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అంగన్వాడి కేంద్రాలలో 3వ తరగతి వరకు విద్యనభ్యసించిన అనంతరం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో డిగ్రీ వరకు చదువుకునేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ రాజ్యంలో విద్య వైద్యం నీటిపారుదలపై ప్రత్యేక దృష్టి సారించమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, స్థానిక కౌన్సిలర్లు సత్తమ్మ శరవంద, బి వెంకటేశ్వర్లు, విభూతి నారాయణ, వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, తిరుపతి రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి వెంకటేష్, ఈరపోగు శ్రీనివాసులు, గంధం మహేష్ బాబు, విశ్వం బాబు, ఉదయ్, గోర్ల అనిల్, ఉదయ్ రాజు, పాఠశాలల ఉపాధ్యాయులు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు - దోర్నాల విద్యార్థులు ఎంపిక

**టీ మీడియా, ఆగస్టు 6, పెద్ద దోర్నాల:**

ఈరోజు పెద్దదోర్నాల మండలంలోని – స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుచున్న ఇద్దరు బాల, బాలికలు పి.వి. వీరాంజనేయులు , కె. క్రాంతి ప్రసన్న (9.వ.తరగతి) జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె. శివాజీ . మరియు కార్యదర్శి డి.ఎల్.కిరణ్మయి వారి పర్యవేక్షణలో జరిగిన జిల్లా స్థాయి యోగా చాంపియన్షిప్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించి, అద్భుతమైన ప్రతిభను కనపరిచి జిల్లాలోనే ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి... రాష్ట్ర స్థాయి యోగా ఛాంపియన్ షిప్" పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ .వి. నారాయణరెడ్డి , ఫిజికల్ డైరెక్టర్స్ పి.రామా నాయక్ %డ% హెచ్ . రామా నాయక్ తెలిపారు.




ఈ జిల్లా స్థాయి ఎంపిక కార్యక్రమం ఈ నెల (ఆగష్టు) 4 వ. తేది ఆదివారం పి.వి.ఆర్. మున్సిపల్ హై స్కూల్, ఒంగోలు నందు ప్రతిభను బట్టి జిల్లాలో ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి వేదిక :– రాష్ట్ర స్థాయి అండర్– 14,16 విభాగం "యోగా పోటీలు ఈ వచ్చే (సెప్టెంబరు)నెల మొదటి వారంలో విశాఖపట్నం జిల్లాలోని "భీమిలి" నగర్ లో జరిగే రాష్ట్ర స్థాయి "యోగా" ఛాంపియన్ షిప్ పోటీల్లో బాల, బాలికలు ప్రాతినిధ్యం వహించనున్నారు. హెచ్ఎం ఎస్. వి. నారాయణరెడ్డి . మాట్లాడుతూ ..ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనై మానసిక ఆందోళన, తదితర అనేక వ్యాధులతో బారిన పడుతున్నారని,ఒత్తిడిని అధిగమించటానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అభినందనల వెల్లువ– జిల్లా స్థాయిలో యోగా పోటీల్లో అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి, విద్యార్థులు వీరాంజనేయులు, క్రాంతి ప్రసన్నలను మరియు శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీలకు తీర్చి దిద్దిన యోగా మాస్టర్ ఏ. మహేశ్వర్ రెడ్డి, యం. ప్రేమ్చంద్ మరియు ఫిజికల్ డైరెక్టర్స్ పి.రామా నాయక్ ని, హెచ్ . రామా నాయక్ లను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్.వి. నారాయణరెడ్డి , స్టాఫ్ సెక్రటరీ ఈ .నాగమూర్తి , సీనియర్ ఉపాధ్యాయులు విజయ మాణిక్యం . అనసూయ దేవి, కిరణ్ కుమార్, పోలయ్య, మీటే నాయక్ మరియు ఉపాధ్యాయ బృందం, ఉపాధ్యాయేతర సిబ్బంది , మరియు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలియజేశారు.

## అన్నదాతల అభివృద్దే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఎమ్మెల్యే

**టీ మీడియా, ఆగస్టు 6, వనపర్తి బ్యూరో :**

గుడిపల్లి ప్రధాన కాలువను పరిశీలించి సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి పోలికెపహాడ్ గ్రామం అల్లిపూర్ నుంచి మోటార్ సైకిల్ పై కెనాల్ వెంట గుడిపల్లి ప్రధాన కాలువ గేట్ల వరకు పర్యటించారు.సీజన్ మొదట్లోనే నీటి సమస్య రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గుడిపల్లి రిజర్వాయర్ వద్ద గేటును తెరిపించి దిగువకు అధిక నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యే.అన్నదాతల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మంగళవారం కల్వకుర్తి ఎత్తిపోతల ప్రధాన కాలువపై పర్యటించి సమస్యలను గుర్తించారూ.సాగునీరు అందడం లేదని అన్నదాతల విజ్ఞప్తి మేరకు ఆయన కాలువపై ఉన్న రెగ్యులేటర్లను, పంటకాలను పరిశీలిస్తూ వాటిని బాగు చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గుడిపల్లి వద్ద ఉన్న ప్రధాన గేట్ల వద్దనే నీరు తక్కువగా విడుదలవుతుందని గుర్తించిన ఎమ్మెల్యే అధికారులను అక్కడికి పిలిపించి గేట్లను ఓపెన్ చేయించి దిగువకు అధిక నీటిని విడుదల చేయించారు.దాదాపు 1500 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు అధికారులు పేర్కొన్నారు.ప్రధానంగా ఈ 15 రోజులనే అన్నదాతలు ఎక్కువగా వరి నాట్లు ఉంటాయని 15 రోజుల వరకు నీటిని విడుదల చేస్తూనే ఉండేటట్లు చూసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశించారు.



## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**టీ మీడియా, ఆగస్టు 6, గోదావరిఖని ప్రతినిధి:**

తెలంగాణ ఉద్యమ కిరణం, దేశవ్యాప్తంగా తన ప్రసంగాలతో ఎలుగెత్తి చూపించిన ప్రొఫెసర్ జయశంకర్ అని అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిట్ సి.రాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం అహర్నిశలు పాటుపడ్డ మహనీయులని, జీవిత కాలం రాష్ట్ర సాధన కోసమే కృషి చేశారని,తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని దేశవ్యాప్తంగా వేదికలో తన ప్రసంగంతో తెలంగాణ ప్రజల నాడిని చేజిక్కించుకున్నారని, నేటి యువతకు ఆయన ఆదర్శప్రాయుడని, పూర్తి దయకుడన్నారు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పోలీసు అధికారులకు సిబ్బందికి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, పిసిఆర్ ఇన్స్పెక్టర్ రవీందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ దామోదర్, మల్లేశం, సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి, సంధ్య, మనోజ్ కుమార్, సిపిఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సింబా సినిమా వేడుకలో ఓదెల మండల వాసుల సందడి

**టీ మీడియా,ఆగస్టు 6,ఓదెల:**

పెద్దపల్లిజిల్లాఓదెలమండలానికి చెందిన దర్శక నిర్మాతలు ప్రకృతి పరిరక్షణ సందేశంతోరూపొందించిన సింబా సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు హైదరాబాదులో అంగరంగ వైభవంగా జరిగాయి,జీలకుంట వాసి దాసరి రాజేందర్ రెడ్డి నిర్మాణ భాగస్వామ్యంతో ఓదెల దర్శకుడు సంపత్ నంది మార్గదర్శకత్వంలో రూపొందిన సింబా సినిమా ఈనెల తొమ్మిదో తేదీన థియేటర్లలో విడుదల కానుంది, ఈ సందర్భంగా నిర్వహించిన ప్రి రిలీజ్ వేడుకల్లో రాజకీయ,చలనచిత్ర రంగాలకు చెందిన పలువురు ప్రముఖులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొని సందడి చేశారు,మాజీ రాజ్యసభ సభ్యులు సంతోశ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు,పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులు ఈ వేడుకలలో పాల్గొనడం చిత్ర కథకు ఎంతో స్ఫూర్తిగా నిలిచింది,ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణ అందరి ధ్యేయం కావాలన్నారు,ఈ సంద ర్భంగా నటి అనసూయ మాట్లాడుతూ,మంచి సినిమాలో నాకొక చక్కటి పాత్ర ఇచ్చి నందుకు దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు,జగపతిబాబుతో కలిసి నటించడం ఆనందంగా ఉంది,ఓ సరికొత్త కథతో తెరకెక్కిన చిత్రమిది,సంపత్ నంది ఈ స్క్రిప్ట్ నుఅద్భుతంగాతీర్చిదిద్దారు,జగపతి బాబు వృత్తి నిబద్ధత చూసి ప్రేరణ పొందా" అన్నారు,అందరికీ కనువిప్పు కలిగేలా, ఓవైపు వినోదం పంచుతూనే మరోవైపు మంచి సందేశమిచ్చే చిత్రం 'సింబా'. ఇది ఏ ఒక్కర్నీ నిరాశపర్చదు,అన్నారు దర్శ కుడు సంపత్ నంది, సమాజానికి మంచి చేయాలని,ఏదైనా తిరిగి ఇవ్వాలని ఈ చిత్రం చేశాం, ఈ కథ అందర్నీ,ఆలోచింపజేస్తుంది,అన్నారు,జీలకుంట మాజీ సర్పంచ్ పత్తి సమ్మిరెడ్డి,మాట్లాడుతూ,హరితహారం కార్యక్రమానికి పొడిగింపు గా మొక్కలు నాటే కార్యక్రమాన్ని తమ గ్రామం నుండి ప్రారంభించాలని కోరారు,అధ్యంతం ఆసక్తికరం గా వినోద భరితంగా సాగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓదెల మండల ప్రజలు తమ ప్రాంతానికి చెందినవారు నిర్మించి దర్శకత్వం వహిస్తున్న సింబా సినిమా ముందస్తు విడుదల వేడుకలలో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## కళాశాలలో జయశంకర్ జయంతి వేడుకలు

**టీ మీడియా ,ఆగస్టు 6, గోదావరిఖని ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రం కోసం అనునిత్యం పరితపించి, మన ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటి, మలిదశ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచిన కొత్తపల్లి జయశంకర్ అని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ నాగమల్ల రాజేందర్ అన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి డి.కల్పన ఆదేశానుసారం గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నమస్కరించారు. జయశంకర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహనీయులు, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్

**టీ మీడియా, ఆగస్టు 6, వనపర్తి బ్యూరో :**

పట్టణ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ పార్కు వద్ద వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు వజ్రాల రమేష్ పాల్గొని వారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణా కర్మయోగి, నిస్వార్థ,నిరాడంబర, విశ్వమానవ తేజోమూర్తి కె.సి.ఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి దశాబ్దంపైగా సైద్ధాంతికంగా ఊపిరులూ ఊదిన తెలంగాణ జ్ఞానశిఖరం ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.



## డైరెక్టర్ జానయ్యనాయుడు ఆత్మహత్య

**టీ మీడియా, ఆగస్టు 6, హైదరాబాద్, :**

టాలీవుడ్‌కు చెందిన డైరెక్టర్ కొమారి జానయ్యనాయుడు (44) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తెలుగులో పలు చిన్న సినిమాలకు దర్శకత్వం వహించారు. నిర్మాతగా కూడా వ్యవహరించారు. కూకట్‌పల్లిలోని ఓ ప్రయివేటు లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తోలుబమ్మల చిత్రాలు బ్యానర్‌లో 'జీఎస్టీ' (గాడ్ సైతాన్ టెక్నాలజీ) అనే సినిమాను నిర్మించటమే కాకుండా దర్శకత్వం కూడా వ్యవహరించారు. తను బుక్ చేసిన రూమ్ సమయం గడిచిపోయినా బయటకు రాకపోవటంతో లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రమాదాలకు నిలయాలుగా మారిన మూలమలుపులు

- కనబడని సూచిక బోర్డులు...
- గాయాలపాలై, మృత్యువడిలోకి

**టీ మీడియా, ఆగస్టు 06, మహానంది:**
నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల్ల అడవి ప్రాంతంలోని రోడ్లు మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అనేక మంది తీవ్ర గాయాలపాలై మృత్యువడిలోకి వెళ్లిన సంఘటనలు చాలానే ఉన్నాయి. మూల మలుపుల వద్ద కనబడని సూచిక బోర్డులు. నంద్యాల–గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల అడవి ప్రాంతంలోని మలుపుల వద్ద సరైన సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు,



ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.ఈ మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో, ప్రతినిత్యం వాహనదారులు ఏదో ఒక రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడుతున్నారు.కొత్త వారు మరింత జాగ్రత్త తీసుకోకుండా ఈ రోడ్ల పై ప్రయాణం చేస్తే ప్రమాదం నుంచి తప్పించుకోలేరనడంలో అతిశయోక్తి లేదు.ఈ రోడ్ల మీదుగా నిత్యం ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర,జిల్లా అధికారులు ఏదో ఒక పని పై ప్రయాణం చేస్తూనే వుంటారు. అయినా వారికి ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద లేని సూచిక బోర్డులు కనిపించకపోవడం శోచనీయం. సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటుచేసి, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి

**టీ మీడియా, ఆగస్టు 6, గోదావరిఖని ప్రతినిధి:**



తెలంగాణ ప్రజా గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతిని గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో మంగళవారం నిర్వహించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి,రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. గద్దర్ ప్రజలకు, కార్మికులకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లారెడ్డి, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి,అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఏఐటియుసి ప్రజా సంఘాల నాయకులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, కె.కనకరాజు, ఎం.ఎస్.గౌడ్, శంకర్, రాజబాబు, మహేందర్ రావు, దయానర్సింగ్, రాజయ్య, బండి కొమురయ్య, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మి దోర్నాల్లో పొలంబడి కార్యక్రమం

**టీ. మీడియా,న్యూస్ ఆగస్టు 6, పెద్ద దోర్నాల :**



పెద్దదోర్నాల మండలం లో ని జమ్మిదోర్నాల గ్రామంలో వ్యవసాయ శాఖ వారు పొలం బడి ప్రదర్శన క్షేత్రం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ రైతులకు పొలం బడి యొక్క ముఖ్య ఉద్దేశం తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడి సాధించడం పొలం బడి యొక్క ముఖ్య ఉద్దేశం. అలాగే భూసారా పరీక్ష ఫలితా ల ఆధారంగా పంటల సాగు మరియు ఎరువుల యాజమాన్యం పాటించాలని, మట్టి నమూనా సేకరణ, గురించి రైతులకు అనగాహనా కల్పించారు.అలాగే ప్రస్తుతం వర్షా భావ పరిస్థితులు దృష్ట్యా రైతులు ప్రత్తి పంటకు బదులుగా కంది, మినుము పంటలు సాగు చేయాలనీ, సాగు చేసిన పంటలు ఈ –పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేసారు. 30% రాయి తి పై కంది, మినుము విత్తనాలు పంపిణి చేస్తున్నట్లు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు యం. రాజేంద్ర ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలు

**టీ మీడియా , ఆగస్టు 6, పెద్ద దోర్నాల :**




పెద్ద దోర్నాల గవర్నమెంట్ హైస్కూల్ నందు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశం లో మండల విద్యాశాఖ అధికారి బి. మస్తాన్ నాయక్ .ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ సమావేశం లో ఈ నెల 8/8/24 నా నిర్వహించే పాఠశాల అభివృద్ధి కమిటీ (సఎంసీ ) ఎన్నికలు ఎన్నికల షెడ్యూల్ ఆధారంగా నిర్వహించాలని ఎటువంటి తప్పిదలు లేకుండా చైర్మన్. వైస్ చైర్మన్ ని ఎన్నుకోవాలని తెలిపారు. అలాగే ఉడిస్ ంలో విద్యార్థుల వివరాలు సరిచేసుకోవాలని అప్డేట్ చేయాలనీ కోరారు.. అలాగే మండల విద్యాశాఖ అధికారి 2. ఎం . కొండలరావు . మాట్లాడుతూ .ఉపాధ్యాయులు టి.ఐ ఎస్.అప్డేట్ చేసుకోవాలని ఎటువంటి తప్పులు లేకుండా ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల ప్రధానోపాధ్యాయులు ఎం .ఆర్ .సి. లు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల స్థలము.కేటాయింపు

- నిర్మాణానికి కృషి చేస్తాం : ఎరిక్షన్ బాబు

**టీ మీడియా , ఆగస్టు 6 ,పెద్ద దోర్నాల:**



దోర్నాల లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ దోర్నాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూరగాని సావిత్రి మరియు లెక్చలర్ . కలిసియర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కి వినతిపత్రం అందించారు. ఇప్పటివరకు జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాలను నడుపుతున్నామని సరైన సౌకర్యాలు, గదులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వ దృష్టికి డిగ్రీ కళాశాల సమస్యను తీసుకెళ్లి పరిష్కార మార్గాన్ని చూపాలని కోరారు.ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ... దోర్నాలలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి డిగ్రీ కళాశాల స్థలము.కేటాయింపు, కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణి

**టీ మీడియా ,ఆగస్టు 6,ఎండపల్లి :**



మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ధర్మపురి విప్ లక్ష్మణ్ కుమార్ చేతులమీదుగా కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు.ఇందులో భాగంగా కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ ద్వారా మంజూరైన 13, మంది లబ్ధిదారులకు 13,0,624 చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని ఆరు గ్యారంటీ లు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టు కుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ.మండల అధ్యక్షులు శైలందర్ రెడ్డి,సందీప్ రెడ్డి బందేలా ఉదయ్ గాజుల శ్రీనివాస్, ఎండపల్లి మండల అధ్యక్షురాలు జాడి విజయ, ఉపాధ్యక్షురాలు తరాల విజయ,ఏమార్పిస్ కుమారస్వామి, మహేష్,ముద్దం మనమ్మ,ఎం ఆర్ ఒ కె రవికాంత్, మంతెన లక్ష్మణ్,డిప్యుటీ తహసీల్దార్ అనిల్ కుమార్, ఆర్ ఐ అన్వేష్, ఎస్ ఐ ఉమాసాగర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**టీ మీడియా,ఆగష్టు 6,ఓదెల:**



పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామం లో,నేదురు రాజ కొమురయ్య తండ్రి పేరు లింగయ్య వయసు 51 సంవత్సరాలు కులం తెను గు మడక గ్రామం లోటైర్ పంచర్ షాపు నడుపుతూ, జీవనం కొనసాగిస్తున్నాడు, పంచర్ షాపు సరిగా నడవక మరియు కుమారుని వివాహానికి చేసిన అప్పులు వల్ల ఆర్థిక పరిస్థితులు బాగాలేక బాధపడుతూ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది తేదీ 4 ఆగస్టు 24 రోజున ఉదయం తన ఇంటిలో పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు కరీంనగర్లో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించు చుండగా ఈరోజు ఉదయం ఏడు గంటల 15 పది నిమిషాలకు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించడు అని మృతుడు భార్య దేవేంద్ర భర్త పేరు రాజ కొమురయ్య వయసు 45 సంవత్సరాలు మడక గ్రామం ఫిర్యాదు మేరకు ఎస్సై జి అశోక్ రెడ్డి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని,తెలిపినారుమృతునికి భార్య ఇద్దరు కుమారులు కలరు ఇద్దరి కూడా వివాహమైనది.

## సంస్థాగత బలోపేతానికి సిద్ధంగా ఉండాలి

**టీ మీడియా, ఆగస్టు 6, గోదావరిఖని ప్రతినిధి:**



రాబోయే ఎన్నికల్లో పార్టీ సంస్థాగత బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉండాలని చెన్నూరు అసెంబ్లీ ప్రబారి క్యాతం వెంకటరమణ అన్నారు. రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండల కేంద్రంలో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు బాణాల స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చెన్నూరు అసెంబ్లీ ప్రబారి క్యాతం వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.త్వరలో నిర్వహించబోయే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి బస్తీలో అన్ని సామాజిక వర్గాలను పార్టీలో చేర్పించే దిశగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోడగుంట జనార్ధన్, బరుపటి నారాయణ, సిద్ధి లింగయ్య, సిలివేరి అంజి, లగిశెట్టి తిరుపతి తోపాటు 11 గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండండని పౌరులకు భారత్ సలహా

**టీ మీడియా, ఆగస్టు 6, న్యూఢిల్లీ :**




బ్రిటన్లో తీవ్రవాద గ్రూపుల నేతృత్వంలో వలస వ్యతిరేక నిరసనలు జరుగుతున్నాయి. సౌత్పోర్ట్, రోథర్హామ్, టామ్వర్త్, లివర్పూల్, మాంచెస్టర్, బ్రిస్టల్ వంటి ఇతర పట్టణాలకు ఈ నిరసనలు వ్యాపించాయి. ఈ నిరసనల్లో పాల్గొన్న 400 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల సౌత్పోర్ట్లో కత్తిపోటుకు గురై ముగ్గురు యువతులు మృతి చెందారు. ఈ విషాదకరమైన హత్య తర్వాత..తప్పుడు సమాచారం వల్ల ఈ నిరసనలు జరిగాయి. హంతకుడు రువాండాకు చెందిన వ్యక్తి. ఇతను ముస్లింవలసదారుడని సోషల్మీడియాలో పుకార్లు వచ్చాయి. వీటివలనే నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనకారులు పలు పట్టణాల్లో ఆశ్రయం పొందుతున్న హోటళ్లను తగలబెట్టారు. మైనార్టీ బ్రిటన్లు అక్రమదోపిడికి పాల్పడుతున్నారని నిరసనకారులు నినదించారు. ఈ నిరసనలను ప్రధానమంత్రి స్టార్మర్ తీవ్రంగా ఖండించారు. నిరసనకారుల్ని పోలీసులు అరెస్టు చేసి.. రిమాండ్లో ఉంచుతారని.. వారికి చట్టపరమైన శిక్షలు పడతాయని ప్రధాని అన్నారు.అనేక పట్టణాలకు ఈ నిరసనలు వ్యాపించాయి. దీంతో బ్రిటన్లో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని లండన్లోని భారత హైకమిషన్ సూచించింది. స్థానిక వార్తలు, స్థానిక భద్రతా ఏజెన్సీలు జారీ చేసే సలహాలను పాటించాలని భారతీయులకు సూచించినట్లు భారత హైకమిషన్ ప్రకటన తెలిపింది.

## సిఐ,ఎస్ఐ లపై సస్పెన్షన్

- ఇన్చార్జ్ ఎస్ఐగా నాగార్జున రెడ్డి


**టీ మీడియా, ఆగస్టు 6, మహానంది:**




మహానంది మండలం సితారామాపురం గ్రామంలో వైసిపి కార్యకర్త పసుపుల పెద్ద సుబ్బరాయుడును హత్య చేసిన ఘటనలో నిర్లక్ష్యం వహించారన్న కారణాలతో నంద్యాల రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ ను సస్పెండ్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ హత్యోదంతం పై సకాలంలో స్పందించనందుకు సిఐ, ఎస్ఐ లపై వేటు పడింది. ఈ సంఘటనకు సంబంధించి మరి కొంతమంది సిబ్బందిపై వేటు పడవచ్చు అంటు పోలీస్ వర్గాలతో పాటు, ఇతరులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. గోస్పాడు మండలం ఎస్సై నాగార్జున రెడ్డిని, మహానంది ఇంచార్జి ఎస్సైగా ఉన్నత అధికారులు నియమించారు. ఎస్సై నాగార్జున రెడ్డి గతంలో మహానంది ఎస్ఐ గా పనిచేసిన అనుభవాలు ఉన్నాయి.

## అభయహస్తం కింద 12 లక్ష లు ఇవ్వాలి

**టీ మీడియా,ఆగస్టు 6,ఎండపల్లి:**



బిజెపి మండల అధ్యక్షులు హన్మంతారావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎస్సి వర్గీకరణ అయిన సందర్భంగా ఎస్సి లకు స్వయం ఉపాధికై సబ్సిడీ రుణాలను సంవత్సరానిక 1000 కోట్లు కేటాయించాలని కోరుతూ ఎస్సీ మోర్చా నాయకులు ఎమ్మార్వో రవికాంత్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ మాట్లాడుతూ అంబేద్కర్ అభయహస్తం క్రింద ప్రతి కుటుంబానికి 12 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని,ఎస్సీ ఉపకులాల మాల మరియు మాదిగ కార్పొరేషన్లకు అవసరానికి 750 కోట్లు కేటాయించాలని,ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇల్లు నిర్మాణానికి 5 లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.లేని పక్షంలో వీటికోసం బిజెపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా జనరల్ సెక్రెటరీ దొనకొండ నరేష్ ,ధర్మపురి అసెంబ్లీ ,ఇన్చార్జికన్నం అంజయ్య ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, పార్టీ అధ్యక్షులు రావు హనుమంతరావు ,మండల జనరల్ సెక్రటరీలు మంచికట్ల రవి, పొన్నం నరేష్ ,సబ్బు సంతోష్ ,మండల సెక్రెటరీ కొదురుపాక అశోక్, అట్లా జగన్ మోహన్ రెడ్డి, కంది వెంకటేష్, దుర్గం రంజిత్,బొద్దుల నాగరాజ్ , ఇప్ప అజయ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు..

- ఇన్స్పెక్టర్లకు ప్రశంస పత్రాలు అందజేసిన డీజీపీ..

**టీ మీడియా, ఆగస్టు 6 ,హైదరాబాదు:**



హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడడానికి కృషి చేసిన ఇన్స్పెక్టర్లకు తెలంగాణ డీజీపీ జితేందర్ ప్రశంస పత్రాలు అందజేశారు. హైదరాబాదులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో.. డీజీపీ జితేందర్ పలువురు ఇన్స్పెక్టర్లను అభినందించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్నటువంటి మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆకుల అశోక్ ను డీజీపీ అభినందించి ప్రశంసా పత్రం అందించారు. అశోక్ గతంలో పని చేసినటువంటి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన హత్య కేసులలో కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను జ్యుడీషియల్ రిమాండ్కి పంపించారు.. అంతేకాకుండా త్వరితగతికన కేసును పూర్తి సాక్షాధారాలతో కోర్టుకు ఛార్జ్ షీటు దాఖలు చేసి నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడడానికి కృషి చేశారు. దీనికి గాను మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆకుల అశోక్.. తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

**నేర సమీక్షా సమావేశం..**

ఇదిలాఉంటే.. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులు, జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో కలిసి డిజిపి డా.జితేందర్ (ఐపీఎస్).. అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో గత ఆరునెలల్లో నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతిపై సమీక్షించారు. గత ఆరు నెలల క్రైమ్ స్టాటిస్టిక్స్, ట్రెండ్స్పై వివరణాత్మక సమీక్ష నిర్వహించి పలు సలహాలు సూచనలు చేశారు. ప్రజా భద్రత, ప్రస్తుత పోలీసింగ్ వ్యూహాల ప్రభావాన్ని అంచనా వేయడం.. అభివృద్ధి చెందుతున్న సవాళ్లను పరిష్కరించడానికి చర్యల గురించి చర్చించి.. డీజీపీ పోలీసు అధికారులకు పలు ఆదేశాలిచ్చారు.

## హైదరాబాద్లో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్

- ఆరు నెలల్లో కార్యకలాపాల ప్రారంభం
- వెయ్యి మందికిపైగా ఉద్యోగాలు, శిక్షణలి

**టీ మీడియా,ఆగస్టు 6,హైదరాబాద్ బ్యూరో :**



ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ హైదరాబాద్ లో తమ అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సెంటర్ నెలకొల్పనుంది. అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గారి నేతృత్వంలోని అధికారుల బృందంతో కంపెనీ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే సెంటర్ పై ఈ సందర్భంగా చర్చలు జరిపారు. కంపెనీ డేటా అనలిటిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్లకు అవసరమయ్యే ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ అందిస్తుంది. హైదరాబాద్ లో ట్రైజిన్ కంపెనీ అర్టిఫిషియల్ ఇంటెలెజెన్స్ ఇన్నోవేషన్ అండ్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాబోయే మూడేండ్లలో 1,000 మందికి పైగా ఉద్యోగులను నియమించుకొని శిక్షణను అందిస్తుంది. కంపెనీ మొత్తం ఆదాయం 160 మిలియన్ డాలర్లకు పైగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ కంపెనీలో పని చేస్తున్న 2,500 మందిలో వెయ్యి మంది మన దేశంలో ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్లో దాదాపు వంద మంది ఉన్నారు. మరో ఆరు నెలల్లోనే తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు ఈ కంపెనీ ప్రకటించింది. రెండు దశాబ్దాలకు పైగా ఐక్య రాజ్య సమితితో పాటు అనుబంధ విభాగాలకు కంపెనీ సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. గత ఏడాది నుంచి ట్రైజిన్ కంపెనీ తమ సేవలను అందుకుంటున్న సంస్థల్లో అర్టిఫిషియల్ ఇంటెలెజెన్స్ వినియోగంతో పాటు ఫలితాలపై విశ్లేషణలు చేస్తోంది. అన్ని రంగాలలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది.

## షేక్ హసీనాకు సాయం చేస్తామని హామీ ఇచ్చాం

- విదేశీ వ్యవహారాల మంత్రి

**టీ మీడియా, ఆగస్టు 6 ,న్యూఢిల్లీ :**



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సాయం చేస్తామని భారత్ హామీ ఇచ్చిందని మంగళవారం అఖిలపక్ష సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జయశంకర తెలిపారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్గాంధీ, డిఎంకె నేత టి.ఆర్. బాలు, ఎన్సిపి నేత సుప్రియా సూలె తదితరులు హాజరయ్యారు.బంగ్లాదేశ్లో జరుగుతున్న పరిణామాలపై ఈ రోజు పార్లమెంటులో జరిగిన అఖిలపక్ష సమావేశానికి వివరించాం. ఏకగ్రీవంగా మద్దతు తెలిపినందుకు వారికి కృతజ్ఞతలు“ అని జయశంకర ఎక్స్లో పోస్ట్ చేశారు. బంగ్లాదేశ్ పరిస్థితిపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశానికి వివరించిందని కాంగ్రెస్ నేత కార్తి చిదంబరం తెలిపారు. జాతీయ భద్రత, ప్రయోజనాలకు సంబంధించినంతవరకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ప్రభుత్వానికి మద్దతుగా ఉందని ఆయన మీడియాకు తెలిపారు. అయితే తాను ఈ సమావేశానికి హాజరుకాలేదని అన్నారు.దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉద్రిక్తమవడంతో హసీనా సోమవారం బంగ్లాదేశ్ నుండి భారత్కు చేరుకున్న సంగతి తెలిసిందే. భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకునేందుకు ఆమెకు కొంత సమయం ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ దేశంలో ఉన్న 10,000 మంది భారతీయ విద్యార్థుల భద్రత దృష్ట్యా బంగ్లాదేశ్ ఆర్మీతో సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజ్యసభలో జయశంకర పేర్కొన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

## తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు..

- ఎల్లో అలెర్ట్ను జారీ చేసిన వాతావరణశాఖ

**టీ మీడియా, ఆగస్టు 6 ,హైదరాద్ :**




తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడురోజుల్లో స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో పలుచోట్ల వీచే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బుధవారం నుంచి గురువారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది.నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగా, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ను జారీ చేసింది. హైదరాబాద్లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుంది.. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, వనపర్తి, మెదక్, నల్గొండ, వరంగల్, సిద్దిపేట, మహబూబాబాద్, కొత్తగూడెంతో పాటు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా కొణిజెర్లలో 148 మిల్లీమీటర్లు, తల్లాడలో 120 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ పేర్కొంది.

## గోదావరి ఫేజ్-2కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

- జీవో జారీ చేసిన దాన కిశోర్

**టీ మీడియా, ఆగస్టు 6 , హైదరాబాద్ :**



మహానగర తాగునీటి అవసరాలను మెరుగుపరిచేందుకు గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్–2కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మంగళవారం జీవో జారీ చేసింది. రెండో దశ పనులకు ప్రభుత్వం రూ.5,560 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టులో నగరానికి అదనపు జలాలను తరలించడంతో పాటు హిమాయత్సాగర్, ఉస్మాన్సాగర్ జలాశయాలను సైతం నింపనున్నది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానంలో పనులు పూర్తి చేయనుంది. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అన్ని సోర్సుల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల నీరు సరఫరా అవుతున్నది.2030 నాటికి నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని 170 ఎంజీడీల అదనపు జలాల్ని సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందు కోసం గోదావరి నుంచే 30 టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉన్నది. 2030 నాటికి హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 750 ఎంజీడీలకు పెరుగుతుందని అంచనా. 2050 నాటికి 1014 ఎంజీడీలుగా ఉండబోతున్నది. ఫేజ్–1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తున్నది. తాజాగా పథకం రెండో దశ ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 15 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది.ఈ 15 టీఎంసీల్లో 10 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా.. మూసీ ప్రక్షాళనలో భాగంగా జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ను వాప్కోస్ కంపెనీ సిద్ధం చేసింది. ఇందులో పంప్హౌస్లు, సబ్స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్పూర్ వరకు 3600 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. అంతే కాకుండా ఘన్పూర్, శామీర్పేట వద్ద 780 ఎంఎల్డీల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తారు. ఘన్పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు.. ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

## ఏఓబీ నుంచి హైదరాబాద్కు గంజాయి

- పట్టుకున్న ఎస్టీఎఫ్

**టీ మీడియా, ఆగస్టు 6 , హైదరాబాద్ :**



ఆంధ్రా, ఒడిశా నుంచి హైదరాబాద్కు గంజాయి తరలిస్తున్న ఓ తరలిస్తున్న ఓ వ్యక్తి ఎక్సైజ్ స్టేట్ టాస్క్ఫోర్స్ పట్టుకున్నది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఎల్బీనగర్కు చెందిన తిప్పర్తి ముకేశ్ అనే యువకుడు తన కారులో ఏఓబీ నుంచి 57 కిలో గంజాయిని హైదరాబాద్కు తరలిస్తూ ఎస్టీఎఫ్కు చిక్కాడు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్రెడ్డి ఆధ్వర్యంలో పని చేస్తున్న ఎస్టీఎఫ్ బృందం డీఎస్పీ తిరుపతి యాదవ్ ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నది. హైదరాబాద్కు చెందిన యువకుడు ఏఓబీ నుంచి గంజాయిని హైదరాబాద్కు తీసుకు వస్తున్నాడనే సమాచారం మేరకు.. డీఎస్పీ తిరుపతి యాదవ్ ఎస్టీఎఫ్ బృందం కారులో వెళ్లి మంగళవారం తెల్లవారు జామున భద్రాచలం టౌన్ చెక్పోస్ట్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టింది.ఈ క్రమంలో గంజాయిని తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నది. కారులో ఉన్న గంజాయిని తూకం వేయగా 57కిలోల వరకు ఉన్నట్లు తేలింది. ఈ గంజాయి విలువ రూ.50లక్షల మేర ఉంటుందని డీఎస్పీ తెలిపారు. గంజాయి పట్టుకున్న బృందంలో ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ సీఐ రమేశ్, ఎస్ఐతోపాటు సిబ్బంది ఉన్నారు. పట్టుకున్న గంజాయిని భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహిమ్ ఉన్నీసాకు అప్పగించారు. గంజాయిని పట్టుకున్న డీఎస్పీతోపాటు సిబ్బంది ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఎన్ఫోర్స్ డైరెక్టర్ కమలాసన్రెడ్డి అభినందించారు.